# ఆ కిటికీలోని పూలకుండీ

ఓ కొలంబస్‌లాగా గర్వంగా ఈ నీళ్ళని, సముద్రాన్ని చూస్తూ ఎవరికీ తెలియని భూభాగాల్ని కనుక్కోవాలని అనుక్కోవడం లేదే.

ఈథర్ లోతుల్లోకి చూస్తూ, ఓ న్యూటన్ లాగా, ఏవో సూత్రాలని, అనంతమైనది కనుక్కోవాలన్న ఆశ లేదే.

ఏ ఏరియల్ సహాయంతోనో ఈ ద్వీపంలో ఉండి ప్రాస్పెరో లాగా ప్రకృతిని శాసించగలిగే శక్తి కావాలని అనుక్కోవడం లేదే...

రాబిన్‌సన్ క్రూసో లాంటి పరిస్థితి రాకూడదని దేవుడిని ప్రార్థిస్తున్నాను.

కాస్ట్‌వేలో టాంహాంక్స్ లాగా ఈ ద్వీపంలోనే ఉండిపోతానా! నిశ్శబ్ద, మనుష్య సంచారం లేని ఈ సముద్రం మధ్యన ఉన్నానని ఎవరికైనా తెలుస్తుందా!

గ్లోబలైజేషన్ మాట అటుంచి, అసలు సివిలిజేషన్ లేని ఈ ద్వీపాన్ని మార్కోపోలో చూసి ఉంటాడా? అనుమానమే!

ఒంటరిగా... ఈ సముద్రం ఒడ్డున...ఎన్నో రాత్రుళ్ళు, ఎన్నో పగళ్ళు, భవిష్యత్తు గురించిన ఆశలు, వర్తమానంపై భయాలు.

దోమలు...యింతింత లావు దోమలు కుట్టి కుట్టి శరీరానికి స్పర్శ అనేది లేకుండా చేశాయి.

ఒళ్ళంతా మొద్దుబారి పోయింది. నడవడానికి రావడంలేదు. మాట మర్చిపోయాను.

యిక్కడికి ఎలా వచ్చానో నాకు తెలీడం లేదు.

నీలాకాశాన్ని నీళ్ళతో కలవకుండా కాపలా కాస్తున్న క్షితిజ రేఖ వేపే చూస్తూ గడిపేస్తున్నాను. ఓ పడవ, ఓ ఓడ - ఏదో ఒకటి...ఏదో ఓ రోజున రాదా! నన్నిక్కడ నుంచి రక్షించలేకపోతారా! కలలు...కలలు అర్ధరాత్రి పుడ్తాయని అంటారు. కానీ, నాకు పగలు కూడా కలలే...అన్నీ కూడా రక్తం...కన్నీళ్ళతో తయారయినవే. యింకా తయారవుతూనే వున్నాయి.

ఎన్ని రోజులు అయ్యాయో తెలీదు. యింకా ఎన్ని రోజులు యిలా కదలలేని స్థితిలో ఉంటానో తెలీదు.

హఠాత్తుగా ఏవో మాటలు...ఎక్కడి నుంచో శబ్దాలు.

నీరసంతో వాలిపోయిన కళ్ళని బలవంతంగా తెలిచి చూసాను.

దేవుడున్నాడని ఋజువు చేసుకున్నాడు.

✦✦✦

కళ్ళు తిప్పి గదంతా చూసి, కిటికీ వైపు చూపు నిలిపాను. ఆ కిటికీకి ఉన్న నిలువు ఇనుప ఊసల్లోంచి బయటికి ఆకాశం, కిటికీ పట్టినంత ఆకాశం కనిపిస్తోంది.

ఆ కిటికీలోనే ఉంది ఆ పూలుకండి. ఖాళీదే. అందులో ఏం పెట్టిలేదు. వెలిసి పోయిన యింకు నీలం కుండి, యింకా వెలిసి అలుముకు పోయిన డిజైన్. ఆకారం బావుంది. గ్రీషియస్ అర్న్ గుర్తొచ్చింది. గ్రీకులు పెద్ద పెద్ద కుండీలు చేస్తారు, వాళ్ళ పూర్వీకుల అస్తికలు అవీ దాచడానికి. ఇది కూడా అలాగే ఉంది మినియేచర్.

దాన్ని అక్కడ ఎవరు పెట్టి ఉంటారు? ఈ గదిలో యింతకు ముందున్న పేషెంట్! ఈ హాస్పటల్ కట్టినప్పట్నించి ఉందా! ఏదైతేనేం! అక్కడ అది చాలా రోజుల్నించి ఉంది. ఎండకు ఎండి, వానకు తడిసి, చలికి పాపం వణికే ఉంటుంది. దుమ్ము, ధూళితో నిండి ఉంటుంది.

తలుపు శబ్ద అయింది.

కళ్ళని తిప్పాను.

ఓ అందమైన అమ్మాయి తలుపు తెరుచుకుని వచ్చింది. ఆమెతో పాటు చలిగాలి కూడా ఒక్కసారిగా రివ్వుమంటూ వచ్చింది.

చిరునవ్వు నవ్వింది.

మా కళ్ళు కలుసుకుంటున్నాయి.

నా ఒంటరితనం పూలకుండీ మీదుగా కిటికీలోంచి బయటి కెళ్ళింది.

వేసుకున్న బ్లేజర్ తీసి కుర్చీ మీద పెట్టింది.

నన్ను మాట్లాడించడానికి ప్రయత్నం చేసింది. ఏవేవో ప్రశ్నలు వేసింది.

నేనెవర్నో తెలుసుకోవడానికి ఆమె చేసే ప్రయత్నాలు ఏ మాత్రం ఫలించడం లేదు. అలలషాక్‌లో నామాట పోయిందని నాముందే అనింది.

అశక్తుడిని, స్పర్శలేని చేతులు, కాళ్ళు ఏ పనికి పనికిరావు.

మాట రావడం లేదు.

నేనెవర్నో, నా బయోడేటా!

ఆమె రోజు ఐదు గంటలకి వస్తుంది. నన్ను మాట్లాడించడానికి ఆస్పత్రివారు ఆమెను ఏర్పాటుచేసి ఉండచ్చు.

ఆ నాలుగ్గోడల బయట ఉండే ప్రపంచం గురించి, గ్రీకు, పురాణాల గురించి, వాన్‌గో పెయింటింగ్స్ గురించి, అగస్టిన్ థింకర్ గురిచి...మధ్య, మధ్య నన్ను ప్రశ్నలు వేస్తూంటుంది జవాబుల కోసం...

నా కళ్ళేం జవాబులు చెప్తాయి!

నేనెప్పుడు మాట్లాడలేదు.

నేను నిశ్శబ్దంగా సాగే వాగుని.

ఆమె మాటలు ఓ ప్రవాహం. ఆమె హృదయం, ఆమె మనసు అన్నీ కూడా ఆ ప్రవాహంలో కలిసిపోతుంటాయి.

ఈ గ్రేట్ నికోబార్ ఐలాండ్స్‌కి ఎలా చేరి ఉంటానో ఊహించి చెప్పింది. ఆ సమయంలో నేను షాక్‌కి గురి అయ్యి అన్ని మర్చిపోయి ఉంటానని, మాటపోయి ఉంటుందని కదలికలు చచ్చిపోయాయని కూడా చెప్పింది.

నాకేం గుర్తులేదు. నేను ఎలా ఆ ద్వీపాల్లోకి వెళ్ళానో. నన్ను పోలీసులు ఎలా రక్షించారో చెప్పింది. లీలగా ఏవో గుర్తొస్తుంటాయి. అలలు...నీళ్ళు...ఎన్ని రోజులో...

రాసి చూపించడానికి చెయ్యి స్వాధీనంలో లేదు.

చిరునవ్వుతో చూస్తుంది...లేచి వెళ్ళిపోతుంది.

ఒక్కోసారి వస్తుంది...కానీ...ఏం మాట్లాడదు. నిశ్శబ్దంగా కిటికీ దగ్గర నుంచుని కళ్ళు తుడుచుకుంటుంది. మౌనంగా వెళ్ళిపోతుంది.

కానీ...యివ్వాళ చాలా ఆనందంగా ఉంది.

ఆమె మొహం అంతా వెలిగిపోతుంది.

నా దగ్గరికొచ్చింది.

నా చేతిని తన చేతిలోకి తీసుకుని యిటూ అటూ ఊపింది.

ఎన్నో కబుర్లు... హామ్లెట్‌కి ద స్పానిష్ ట్రాజెడీకి ఉన్న దగ్గర పోలికల్ని చెప్పింది. అసలు షేక్స్పియర్ రాసిన హామ్లెట్ మొదట్లో థామస్ కిడ్ దే. కథ, కథనం, నాటకం, నాటకంలో నాటక్. ఎన్నో...ఎన్నో...

నా మొహంలోకి చూసింది జవాబుల కోసం...

నా కళ్ళేం మాట్లాడుతాయి? ప్చ్!...గొంతు రావడం లేదు.

చెరగని నవ్వుతో కోటు తీసుకుని వెళ్ళిపోయింది.

ఎగురుకుంటూ వెళ్ళే తూనీగ గుర్తొచ్చింది.

నేను ఆమెను ప్రేమిస్తున్నాను...ఆరాధిస్తున్నాను...ఆమెతో చెప్పలేను.

ఫిజియోథెరపిస్ట్, నర్స్, ఈ అమ్మాయి రెగ్యులర్‌గా వస్తూంటారు. ఈ అమ్మాయి నా హృదయానికి దగ్గరగా వచ్చింది. నన్ను మాట్లాడించడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఆమె చేసే ప్రయత్నాలకే ప్రేమిస్తున్నానా!

కళ్ళు బరువెక్కాయి.

సంధ్య వెలుగుల కనురెప్పల మీద చీకటి ఛాయలు సన్నగా ముద్దు పెట్టుకుని వీడ్కోలు చెప్పింది.

చెల్లా చెదరయిన జీవితాన్ని దగ్గరికి తెస్తోంది ఆమె. ఆమె ఊహలు, ఆమెతో జీవితం...సాధ్యమా! కాదా అన్న డిబేట్ పెట్టుకోలేదు.

ఆకాశం నల్లగా మారిపోయింది. ఆ నేపథ్యంలో పూలకుండి నల్లగా మారి పోయింది. చినుకులు కిటికీలోంచి గదిలోకి వస్తున్నాయి.

అది మాత్రం పట్టనట్లుగా అలాగే ఆ జల్లులో తడుస్తూ చలనం లేకుండా ఉంది.

నాకెందుకో జిబ్రాల్టర్ రాక్ గుర్తొచ్చింది.

ఎండకి, వానకి, ఎలాంటి ప్రకృతి చలనాలకి స్పందిచకుండా తట్టుకుంటోంది.

అది కూడా నాలాగా మూగదే. గొంతు లేదు. ఉంటే, కథలు చెప్పేదా! ఎలాంటి కథలు! సుఖాంతమైన ప్రేమ కథలు.

మర్నాడు...

యథాప్రకారంగా ఆమె ఐదు గంటలకి వచ్చింది.

రోజులాగా తలుపు తట్టలేదు.

ధడాలున తలుపు తోసింది. సుడిగాలి ఆమె వెనక్కాల.

రోజులాగా కోటుని కుర్చీ మీద వెయ్యలేదు. కోటు వేసుకోలేదు.

తెలుపు గులాబీరంగు గళ్ళ చొక్కా నీలం జీన్స్ మీద వేసుకుంది.

హడావిడిగా వచ్చినట్లుంది నుదురు మీద చెమట బిందువులు.

ఎర్రటి నీరెండ, హెన్నా వాడే ఆమె జుట్టు మీద పడి ఎర్రగా మెరుస్తోంది.

ఎర్రగా, తడిగా ఉన్న పెదవుల వెనక తెల్ల ముత్యాలు.

'ఆనందంగా ఉంది' అనుకున్నాను.

రెండు చేతులు వెనక్కాల పెట్టుకుని కొంచెం ముందుకి వంగి కళ్ళు ఎగరేసింది. మళ్ళీ అందంగా నవ్వి తల పైకెత్తింది.

ఎంఛాంటింగ్ స్మైల్.

మంత్రం వేసింది.

మళ్ళా ముందుకు వంగింది.

వెనకనున్న రెండు చేతుల్లో కుడుచేతిని నా ముందుంచింది.

ఆ చేతిలో ఓ పూలగుత్తి.

గులాబి రంగులో ఉన్న చిన్న చిన్న గులాబి పువ్వులు, ఆకుపచ్చని ఆకుల మధ్య ఠీవిగా, ముద్దుగా, అందంగా ఒదిగి ఉన్న పూలగుత్తి.

నా ముందునుంచి, ఓసారి అటూ యిటూ తిప్పింది.

నాలోని భావాలకి ఓ రూపం వస్తోంది.

ఆమె ఇన్నాళ్ళ అనుభవంతో పూలగుత్తిని నా చేతికివ్వనివ్వలేదు.

వెనక్కి తిరిగి కిటికీ దగ్గరికెళ్ళి, పూల కుండీలో పెట్టింది.

సన్నటి కూనిరాగం తీస్తూ అటు, యిటూ తిరుగుతూ గుమ్మంవైపు చూస్తోంది.

జీవితంలోని ముఖ్య నిర్ణయం తీసుకుంటోందా! మళ్ళా నాలో ఊహలు రెక్కలొచ్చాయి. కిటికీ వైపు మళ్ళాయి. బొకే మీద కూచున్నాయి. ఆ తర్వాత హాయిగా ఎగురుకుంటూ ఆకాశం వైపు వెళ్ళాయి.

నా చెవు దగ్గర తన మొహం ఉంచింది.

ఏదో గుసగుసలాడింది.

కళ్ళు తిప్పాను, గుమ్మంవైపు చూసాను.

అక్కడ జీన్స్ మీద తెల్ల టీషర్ట్ వేసుకున్న ఓ యువకుడు కనపడ్డాడు. నా కళ్లలోకి చూసింది. అందులో భావాలు ఆమెకు అర్థం అవవు. ఆ స్థితిలో లేదు.

నేల్ పాలిష్ ఉన్న తన పొడుగాటి వేళ్ళని, గుమ్మం వైపుగా ఉంచి అందంగా ఊపింది.

నా గుండె చప్పుడులో చిన్న అపశృతి.

నా చెవు దగ్గరగా తన ముఖం వంచింది.

"నితిన్ నిన్ను చూడాలని అంటే..."

గుండె బరువెక్కుతోంది.

మోయలేని బరువు.

ఆమెలో దాచుకోలేని ఆనందం.

ఫెళ్ళున శబ్దం.

ఏదో విరిగింది.

మట్టి పెంకులు చెల్లా చెదరయ్యాయి.

కిటికీ నిండా ముక్కలు.

నా కళ్ళల్లో భరించలేని బాధ.

అందరం ఆ వైపు చూశాం.

రాత్రంతా నానిపోయిన ఆ పూలకుండి బద్దలైంది.

గ్రీషియస్ అర్న్, నిన్నటి వరకూ ఏంవిటి, యింతకు ముందు క్షణం వరకు జిబ్రాల్టర్ రాక్...యిప్పుడు...మట్టి పెంకులు. గుండెని ఆ బరువుని చేయితో అదుముకోలేని అశక్తత. కనపడని వేదన.

ఇదేనా జీవితం! ఇంతేనా!

"మట్టిది కదా!" అన్నాడు విరిగినదానికి సంజాయిషీగా.

'మరి నా హృదయం'.................

✧ **అక్టోబర్ 2005 రచనమాస పత్రిక** ✧

*(సునామీ అలలకి కొట్టుకుపోయి యాభై రోజుల తర్వాత గ్రేట్ నికొబార్ దీవుల్లో రక్షక పోలీసులు ఓ స్త్రీని రక్షించిన ఘటనే ఈ కథకి ప్రేరణ - రచయిత్రి)*